# ప్రజాశక్తి

ఆదివారం 19 మార్చి 2023 | 8 పేజీలు

ప్రకాశం | బాపట్ల

గంజాయి రవాణా చేస్తున్న కారును వెంబడించి పట్టుకున్న పోలీసులు

## కారును వెంబడించి..

# రివాల్వర్ చూపించి..

- 'గంజాయి' కారును వెంటాడిన మార్టూరు పోలీసులు
- సినీఫక్కీలో నిందితులను అదుపులోకి తీసుకున్న వైనం
- 150 కిలోల వరకు గంజాయి స్వాధీనం!

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**

భారీ మొత్తంలో అక్రమంగా గంజాయిని కారులో తరలిస్తున్న ముఠాని పోలీసులు సినీ ఫక్కీలో వెంబడించి పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 150 కిలోల వరకు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మార్టూరులో శనివారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం... కారులో గంజాయిని అక్రమంగా ఓ ముఠా తరలిస్తున్న సమాచారం అందుకున్న ఎస్సై కమలాకర్ స్థానిక నాగరాజు పల్లి రోడ్డులో నిఘా ఉంచారు. బల్లికురవ నుండి మార్టూరు వచ్చే రోడ్డులో గంజాయి తరలిస్తున్న వాహనం వస్తుందని తెలుసుకున్న ఎస్ఐ ఓ ప్రైవేట్ వాహనంలో అదే మార్గంలో ఎదురువెళ్తున్నారు. మార్టూరు శివారులో నిందితుల వాహనాన్ని గుర్తించిన ఎస్ఐ వెంటనే స్టేషన్ కి సమాచారం ఇచ్చి ఏఎస్ఐ సైదా, పోలీస్ ▶ 2లో

# అన్నదాతను ముంచిన వర్షం

- నీటమునిగిన మొక్కజొన్న పంట
- తడిసిముద్దయిన వరి ఓదెలు
- భయాందోళనలో పొగాకు రైతులు

దర్శిలో నీటమునిగిన వరి ఓదెలు

**అకాల వర్షంతో అన్నదాతకు నష్టాలు తప్పేలా లేవు. ఈ పాటికే కురిసిన వర్షానికి మొక్కజొన్న పంట నీటిలో నానుతోంది. వరి ఓదెలు తడిసి ముద్దయ్యాయి. పొగాకు ఎక్కువ చోట్ల కొట్టుడు దశలో ఉండటంతో భారీవర్షం కురిస్తే మళ్లీ నష్టపోతామనే భయాందోళనలో రైతులున్నారు.**

**ప్రజాశకి-భట్టిప్రోలు**

కురుస్తున్న అకాలవర్షంతో అన్నదాతకు అపార నష్టం వాటిల్లుతోంది. గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షంతో రబీలో సాగు చేసిన మొక్కజొన్న పంట నీటిలో నానుతూ దెబ్బ తిని ఉరకతీతకు గురై ఎండు దశకు చేరుతోంది. పొలాలలో ఉన్న పంట కాలువలు సైతం నిండుగా ఉండటంతో నీరు బయటికి వెళ్లే మార్గం లేక పండు బారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు మరో రెండు రోజుల పాటు ఉంటే మరింత

భట్టిప్రోలులో నీటమునిగిన పంట

నష్టానికి గురికావలసి వస్తోందని వాపోతున్నారు. అద్దేపల్లి, ఐలవరం, పల్లెకోన, వేమవరం వంటి గ్రామాలలో నీరు నిల్వ ఉండి దెబ్బతింటుందని రైతులు పేర్కొంటున్నారు. లంక గ్రామాలలో కల్లాలలో ఉన్న పసుపు వర్షపునీటికి తడిచి నీటిలోనే నానుతోంది. ఎక్కువ రోజులు పసుపు తడిచి ఉంటే బూజు పట్టి రంగు మరే ప్రమాదం ఉందని, దీనివల్ల నాణ్యత కోల్పోయి ధరలో కోత పడుతుందని రైతులు వాపోతున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పసుపు వర్షపుధాటికి నష్టాలను చూడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ఇదే రీతిలో కొనసాగితే వాణిజ్య పంటల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం కనిపిస్తోంది.

**దరిశి:** మండలంలో శనివారం కురిసిన వర్షానికి ఆయకట్టు చివరి భూములలో నాటి వరి పంట కోసి కుప్పలు వేయడంతో ఓదెలు తడి ముద్దయ్యాయి. మండలంలోని కొత్తపల్లిలో బట్టు గోపి రెండెకరాలు వరి కోసి కుప్పలు వేయడంతో మొత్తం నీటిలో మునిగిపోయింది. దరిశితో పాటు తాళ్ళూరు మండలంలోని బొద్దికూరపాడు, చింతలపాలెం గ్రామాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ అకాల వర్షం వల్ల పెట్టిన పెట్టుబడులు కూడా రావని పలువురు రైతులు వాపోతున్నారు.

**పొగాకు రైతుల గుండెల్లో రైళ్లు..**

**టంగుటూరు:** వర్షం రాకతో ▶ 2లో

# పకడ్బందీగా 'పది' పరీక్షలు

- పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించొద్దు
- విద్యార్థులను మానసికంగా సన్నద్ధం చేయండి
- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

పదోతరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న అకడమిక్, ఓపెన్ స్కూల్, ఒకేషనల్ పరీక్షలను సమర్థంగా నిర్వహించడానికి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శనివారం ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, మాల్ ప్రాక్టీస్‌కు సహకరించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 582 పాఠశాలల నుంచి 28,902 రెగ్యులర్ విద్యార్థులు, 350 మంది గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. వీరి కోసం 175 రెగ్యులర్ సెంటర్‌ను కేటాయించామన్నారు. పరీక్షా కేంద్రాలలో ఫర్నిచర్, లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, శుభ్రమైన టాయిలెట్స్ వంటి కనీస వసతులు ఉండేలా చీఫ్ సూపరింటెండెంట్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను స్టోరేజీ స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు తీసుకువెళ్లడం, పరీక్షా కేంద్రంలో వాటిని ఓపెన్ చేసేటప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించడంలో ఏమాత్రం ఉల్లంఘన జరిగినా బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల మాదిరిగా ఈ పరీక్షల నిర్వహణలోనూ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఒపి) పాటించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాయబోతున్నందున అందుకు తగినట్లుగా మానసికంగా వారిని సన్నద్ధం చేయాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి స్మార్ట్ వాచీలు, సెల్ ఫోన్లు, ఇతర ఏ విధమైన ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించరాదని ఆదేశించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బయటి వ్యక్తులను అనుమతించరాదని ఆదేశించారు. ఈ విషయాలపై అవగాహన కల్పించేలా విద్యార్థుల తల్లిదండ్రులతోనూ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. పబ్లిక్ పరీక్షల సందర్భంగా విద్యార్థులపై ఇతర అంశాలేవీ ప్రభావం చూపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడేలా సూచించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వచ్చే రెండు వారాలు ప్రిపరేషన్ పై ప్రత్యేక దష్టి పెట్టి విద్యార్థులు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేలా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్లకు తెలిపారు. ఒత్తిడి, వేసవి దష్ట్యా విద్యార్థులు ఏమైనా అనారోగ్యానికి గురైతే తక్షణమే స్పందించేలా పరీక్షా కేంద్రాలలో ప్రాథమిక చికిత్సా శిబిరాలు ఏర్పాటు ▶ 2లో

ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జాలా అంజయ్య

**'ఉపాధి హామీ' రక్షణ కోసం..**

**చలో ఢిల్లీకి తరలిరండి**

**వ్యకాసం.. పిలుపు**

## కంచర్ల శ్రీకాంత్‌కు

# ధ్రువీకరణ పత్రం అందజేత

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ప్రాధాన్యతా ప్రకారం ఓట్ల లెక్కింపులో కంచర్ల శ్రీకాంత్ ఘన విజయం సాధించారు. శనివారం ఉదయం చిత్తూరులో ఆర్‌వియస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇందుకు సంబంధించిన ధృవపత్రాన్ని రిటర్నింగ్ అధికారి, చిత్తూరు జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ అందజేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16న ఉదయం 8 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై 18 న ఉదయం 2 గంటల వరకు కొనసాగింది. ఎలిమినేషన్ ఓటింగ్ ప్రక్రియతో తన సమీప వైసిపి అభ్యర్థి పేర్నాటి

ధృవీకరణ పత్రం అందుకుంటున్న శ్రీకాంత్

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిపై 34,110 ఓట్ల ఆధిక్యంతో కంచర్ల శ్రీకాంత్ గెలుపొందారు. ఎలిమినేషన్ కౌంటింగ్ ప్రాధాన్యతా ప్రక్రియ విధానంతో మొత్తం 2,48,360 ఓట్లకు గానూ కంచర్ల శ్రీకాంత్ కు 1,24,181 ఓట్లు, శ్యామ్ ప్రసాద్ పెర్నాటికి 90,071 ఓట్లు వచ్చాయి.

## అన్నదాతను ముంచిన వర్షం

(మొదటిపేజీ తరువాయి)

పొగాకు రైతులు భయాందోళనలు చెందుతున్నారు. ఈ ఏడాది పొగాకు ధరలు కూడా కొంత ఆశాజనకంగా ఉండడంతో రైతులు తమ ఆశలన్నీ పొగాకు పైనే పెట్టుకున్నారు. మండలంలో ఈ ఏడాది దాదాపు 7 వేల ఎకరాలలో రైతులు పొగాకును సాగు చేయగా మాండూస్ తుఫానుతో పొగతోటల్లో నీరు నిలిచి వారు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. అయినప్పటికీ వారు ఏ మాత్రం నిరాశ చెందకుండా తుఫానుకు పోయిన పంటల స్థానంలో మళ్లీ అంతే పొగనారును రెట్టింపు ధరకు కొనుగోలు చేసి మళ్లీ భూములను సాగుకు సిద్ధం చేసి.. రెండో విడత నాటుకున్నారు. మండలంలోని రైతులు రెండో విడత మళ్లీ దాదాపు 4 వేల ఎకరాలలో పొగాకును సాగు చేశారు. తొలివిడతలో నానా తంటాలు పడి దక్కించుకున్న పొగాకును ప్రస్తుతం కొద్దిగా అమ్ముకోవడంతోపాటు అధిక శాతం పొగాకు ఇంకా బ్యారన్‌లలో కాల్చు జరుగుతోంది. దీనికి రెట్టింపు పొగాకు తోటల మీద కొట్టుడుకు వచ్చిన దశలో ఉంది. నేడో రేపో పచ్చాకును కొట్టి అల్లకానికి కూలీలను సైతం రైతులు సిద్ధం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పొగాకు రైతులందరూ శుక్రవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షంతో తల్లడిల్లిపోయారు. శనివారం మధ్యాహ్నం సైతం టంగుటూరు మండలంలో భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి, ఆదివారాలలో కూడా వర్షం పడే సూచనలు కనిపించేలా కారుమబ్బులు కమ్ముకున్నాయి. దీంతో పొగాకు రైతులు ఆకాశం వైపు చూస్తూ తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## కారును వెంబడించి.. రివాల్వర్ చూపించి..

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే తన కారుని రివర్స్ చేసుకుని గంజాయి తరలిస్తున్న వాహనాన్ని వెంబడించసాగారు. అప్పటికే స్థానిక పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్ దగ్గర కాపు వేసి ఉన్న ఎఎస్ఐ సైదా గంజాయి తరలిస్తున్న కారుని అడ్డగించారు. వెనకనే వెంటాడుతూ వస్తున్న ఎస్ఐ కమలాకర్ కారులోంచి దూకి తన రివాల్వర్ చూపుతూ లొంగిపోవలసిందిగా హెచ్చరించడంతో గంజాయి తరలిస్తున్న నిందితులు చేసేది లేక కారును అక్కడే నిలిపివేశారు. అప్రమత్తమైన ఎఎస్ఐ సైదా, ఇతర పోలీసు సిబ్బంది నిందితులను అదుపులోకి తీసుకుని అదే కారులో ఎక్కించగా ఎస్ఐ కమలాకర్ స్వయంగా కారు నడుపుకుంటూ గంజాయితో సహా నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న కారులో సుమారు 150 కిలోల గంజాయి ఉన్నట్లు సమాచారం. పోలీసులు అదుపులోకి తీసుకున్న ముగ్గురు నిందితులను ఇతర ప్రాంతాల్లో విచారిస్తున్నట్లు తెలిసింది.

## పకడ్బందీగా 'పది' పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

చేయాలన్నారు. పరీక్షల సమయంలో ఏ విధ మైన సహాయం కావాలన్నా అందించేలా జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణలో కూడా పూర్తి స్థాయి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన పునరుద్ఘాటించారు. పరీక్షల వేళల్లో విద్యార్థులకు తగిన రవాణా సౌకర్యం అందుబాటులో లేనట్లు గుర్తిస్తే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిఇఒ పి రమేష్, డిప్యూటీ డిఇఒ అనితా రోజా రాణి, ఆల్టర్నేటివ్ లెర్నింగ్ స్కూల్ (ఏ.ఎల్.ఎస్) కోఆర్డినేటర్ వి సుబ్బారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వ్యాధి నిరోధక టీకా కేంద్రాలు పరిశీలన

**ప్రజాశక్తి-శింగరాయకొండ:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సచివాలయ ముందు జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పి పద్మజా శనివారం తనిఖీ చేశారు. మూలగుంటపాడులోని మలినేని పెరుమాళ్ల ఐటిఐ కళాశాల సెంటర్, ఈదుగ మిట్ట బాలయోగి నగర్, దుర్గా సెంటర్‌లో జరుగుతున్న కార్యక్రమంలో రికార్డులను పరిశీలించి పిల్లలకు గర్భవతులకు 12 రకాల వ్యాధులు గురించి వివరించారు. డాక్టర్ చైతన్య కృష్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, రాఘవేంద్రరావు, సూపర్‌వైజర్ జవహర్ వలి, శ్రీనివాసులు, రాధిక, గిరిజ, రాధా, భారతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి-టంగుటూరు**

మండలంలోని మల్లవరప్పాడు గ్రామస్తుల మంచినీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ అన్నారు. మల్లవరప్పాడు గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను నిర్మించేందుకు ఐటిసి అధికారులు అంగీకరించిన నేపథ్యంలో బోరు నిర్మాణానికి అయ్యే పనుల ఖర్చును బట్టి ఎంపీపీ నిధుల ద్వారా రూ.2 లక్షల వరకు మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ పేర్కొన్నారు. ఈ నిధులతో బోరు నిర్మాణంతో పాటు వాటర్ ప్లాంట్ వరకు పైపులైను, ప్లాట్ ఫారాల నిర్మాణం తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ కోటేశ్వరమ్మ శనివారం మల్లవరప్పాడు గ్రామానికి వచ్చి బోరు నిర్మాణానికి భూమిపూజ చేశారు. నిర్మాణం పూర్తయిన తరువాత ఐటీసీ వారి ఆర్థిక సహకారంతో వాటర్ ప్లాంట్‌ను నిర్మించి తద్వారా బోరు నీటిని ప్యూరిఫై చేసి పైపులైన్ల ద్వారా గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి తుమ్మ మస్తాన్ బాబు, గ్రామ వైస్ సర్పంచ్ చెవల రామారావు, గ్రామ వైసీపీ నాయకులు, వర్క్ కమిటీ సభ్యులు దావులూరి సునీల్, గౌతుకట్ల వెంకీ, పాతూరి హరికృష్ణ, వడ్డెవోలు వెంకటేశ్వర్లు, మట్టే వెంకట్రావు, పొగర్తి గోపి పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎంపీపీ కోటేశ్వరమ్మ, గ్రామ వైసిపి నాయకులు

## వృద్ధుడిని ఢీకొట్టిన కారు

**ప్రజాశక్తి-పొదిలి:** పొదిలి పట్టణంలోని విశ్వనాథపురం మెయిన్ రోడ్ సబ్ స్టేషన్ క్రాస్, మెడ్ ప్లస్ సెంటర్లో వేగంగా వచ్చిన కారు ఒకటి వెనక నుంచి ఢీకొట్టడంతో ఒక వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణంలోని బ్రహ్మం గారి గుడి దగ్గర నివాసముంటున్న అన్నపురెడ్డి తిరుపతిరెడ్డి అనే వృద్ధుడు ఉదయం పచారీ సరుకుల నిమిత్తం రోడ్డుపైకి వచ్చాడు. విజయవాడ నుంచి కొనకనమిట్ల మండలానికి వస్తున్న ఏపి 31 టివి 7800 నెంబర్ కారు తిరుపతిరెడ్డిని వెనుక నుంచి ఢీ కొట్టింది. కారు కుడి కాలు పైకి కారు ఎక్కడం తో నుజ్జునజ్జయి విరిగింది. కింద పడిపోయిన తిరుపతిరెడ్డిని స్థానికులు పక్కకు తీసేలోగా కారులో వ్యక్తులు వెళ్లిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాదయాత్ర బృందంతో గ్రామస్తులు

## మాదిగలకు ఇచ్చిన మాట నిలుపుకోవాలి

**ప్రజాశక్తి-హనుమంతునిపాడు**

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 4న హైదరాబాదు, విజయవాడ నగరాలను ముట్టడించాలని మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మాదిగల సంగ్రామ పాదయాత్ర 8వ రోజు వేములపాడు గ్రామానికి రావినూతల కోటయ్య మాదిగ నాయకత్వంలో చేరుకున్నది. 100 రోజులలో అధికారం వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెడతామని మాట ఇచ్చి నేటికీ 9 సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు ఎస్సీ వర్గీకరణ ఊసే లేకుండా మాదిగలను మోసం చేసిన బిజెపికి రానున్న కాలంలో గుణపాఠం చెబుతామని, గ్రామాలలో తిరగనివ్వబోమని హెచ్చరించారు. ఏప్రిల్ 4న జరగబోయే బిజెపి కార్యాలయం ముట్టడిని అధిక సంఖ్యలో మాదిగ మాదిగ ఉపకులాలు పాల్గొని మాదిగ సత్తను చాటాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నరసింగరావు మాదిగ, జిల్లా కన్వీనర్ ఆదిమూలపు ప్రకాష్‌మాదిగ, జిల్లా కన్వీనర్ తోరటి ఆనంద్ మాదిగ, రాష్ట్ర నాయకులు గోచిపాతల రవి మాదిగ, నాయకులు పూనూరి క్రిష్టాఫర్ మాదిగ, మండల నాయకులు తగరం యేసు మాదిగ, కొదమల తిమోతి మాదిగ, వినోద్, భాస్కర్ మాదిగ, పరుసుపోగు భాస్కర్ మాదిగ, ప్రభాకర్ మాదిగ, జై ప్రకాష్ మాదిగ, అశోక్ మాదిగ, రావినూతల కిషోర్, కొదమల రామయ్య మాదిగ, అనిల్ మాదిగ, దేవయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నిశకం సుబ్బులు పెద్దకర్మకు హాజరైన ఎమ్మెల్యేలు కరణం, మద్దిశెట్టి

# సర్పంచ్‌గా సుబ్బులు సేవలు ఆదర్శవంతం

**ప్రజాశక్తి-దరిశి**

తాళ్లూరు మండలం శివరామపురం మాజీ సర్పంచ్ నిశకం సుబ్బులు చేసిన సేవలు అందరికి ఆదర్శమని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, తాళ్లూరు మండల వైసిపి ఇన్‌ఛార్జి మద్దిశెట్టి రవీంద్ర అన్నారు. శనివారం శివరామపురంలో సుబ్బులు పెద్దకర్మకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు, వైసిపి నాయకులు హనుమంతరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ ఇడమకంటి వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, ప్రియాంక నాగార్జునరెడ్డి, కోఆప్షన్ మెంబరు కరిముల్లా, నాయకులు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకరరెడ్డి, యలమందారెడ్డి, దేవదానం, విష్ణు పాల్గొన్నారు.

## రైతులు చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రజాశక్తి-దరిశి**

మాట్లాడుతున్న సహాయ సంచాలకులు

రైతులు చిరు ధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు జి సుబ్బారావు అన్నారు. శనివారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంలో చిరు ధాన్యాల ప్రాముఖ్యత అనే అంశం గురించి ప్రోగ్రామ్ కోఆర్డినేటరు దుర్గాప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వచ్చే చిరుధాన్యాలు రైతులు పండించి అధిక లాభాలు సాధించాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వాలు కూడా చిరుధాన్యాల మీద దృష్టి పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎం ఉష, జాహ్నవి, లీలాకృష్ణ, శివ, వెంకటేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.


### డాక్యుమెంట్ పోయినది

నాగులుప్పలపాడు మండలం కనపర్తి గ్రామానికి చెందిన వూర రంగనాథరావు తండ్రి వెంకటేశ్వర్లుకు చెందిన 876/1970 నెంబరుగల లింక్ డాక్యుమెంట్ ఒరిజినల్ ఒంగోలు కోర్టు సెంటరులోని స్టేట్ బ్యాంకు నుండి వస్తుండగా పోయినది దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలపగలరు తగిన పారితోషకం ఇవ్వబడును.

ఇట్లు
**వూర రంగనాథరావు, తండ్రి వెంకటేశ్వర్లు**
**కనపర్తి గ్రామం, నాగులుప్పలపాడు మండలం**
**ఫోన్ : 8555016078**



**మహారాజశ్రీ ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో.**

**ఓఎస్ నెం : 1129/2019**

ఎమ్. ఉమామహేశ్వరరావు ..వాది
వర్సెస్
ఎమ్. శ్రవణకుమార్ ..ప్రతివాది

టు,
మందపాటి శ్రవణకుమార్, తండ్రి సాంబయ్య, హిందూ, 35 సంవత్సరాలు,ఇంటి నెంబరు:2-79, తూర్పు బజారు, అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు మండలం, ప్రకాశం జిల్లా.

పై తెలిపిన వాది మీపై పై నెంబరు కేసు దాఖలు చేయగా, మీరు నోటీసులు తీసుకుని ఉండలేదు. పై నెంబరు కేసు పై తెలిపిన కోర్టులో తేది 03-04-2023 న వాయిదా ఉన్నది. తేది 03-04-2023 ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా మీ న్యాయవాది ద్వారా గాని పై కోర్టు లో హాజరు కావలసినది. లేనియడల మీ పరోక్షములో కేసు తీర్మానమగును.

// కోర్టు వారి అనుమతితో //

ఇట్లు
**ఐ.మల్లికార్జునరెడ్డి**
**ఐ. ఇన్దిర**
**ఎమ్.మాధవ**
అడ్వకేట్స్, ఒంగోలు.



**మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో**

**ఇ.పి. 1/2020**
ఇన్
**ఓ.ఎస్. 272/2015**

పోలిశెట్టి శ్రీనివాసులు .......డిహెచ్ఆర్
వర్సెస్
ధనిరెడ్డి సుబ్బలక్ష్మి ........ జెడిఆర్

**వేలం ప్రకటన**

పై నెంబరు ఇ.పి. 1/2020 షెడ్యూలు ఆస్తిని డిహెచ్ఆర్ బాకీ రాబట్టు నిమిత్తం ఘనమైన కోర్టులో 3-4-2023వ తేదీ ఉదయం 10:30 గంటలకు బహిరంగ వేలం వేయుటకు కోర్టువారు నిర్ణయించడమైనది. బహిరంగ వేలంలో పాల్గొన దలిచిన వారు వేలంలో పాల్గొనవచ్చును.

**షెడ్యూలు**

ప్రకాశం డిస్ట్రిక్, మార్కాపురం సబ్ రిజిస్ట్రేషన్, మార్కాపురం మున్సిపాలిటీ ఏరియా, మార్కాపురం టౌన్. సర్వే నెం: 1257/1ఎ మరియు 1257/1సి. ఎ॥3.39 సెంట్లు. ప్లాట్ నెం: 218 మరియు 219 సింగిల్ ప్లాట్. మొత్తం విస్తీర్ణం: 171.5 చ.గ.లు లేక 144.06 స్క్వేర్ మీటర్లు. ఖాళీ స్థలము హద్దులు

**తూర్పు :** ప్లాట్ నెం: 217 ఖాళీ స్థలం,
**దక్షిణం:** ప్లాట్ నెం: 220 ఖాళీ స్థలం,
**పడమర:** రస్తా,
**ఉత్తరం:** బాసాని అలివేలమ్మ
**డిహెచ్ఆర్ విలువ : రూ. 75,000/-**
**అమీనా విలువ: రూ. 80,000/-**
**మార్కెట్ విలువ రూ. 75,000/-**
**సబ్ రిజిస్ట్రేషన్ విలువ: రూ. 2,74,400/-**
**వేలం తేదీ: 3-4-2023**
**ఫరదర్ హియరింగ్: 10-04-2023**
(కోర్టు వారి ఉత్తర్వులతో)

ఇట్లు
**ఆకుల ఉషశ్రీ**
అడ్వకేట్, మార్కాపురం

# యుద్ధప్రాతిపదికన ఇళ్ల నిర్మాణాలు

## అధికారులకు బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

**ప్రజాశక్తి-మేదరమెట్ల**

జగనన్న కాలనీలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలలో గృహాలను యుద్ధప్రాతిపదికన నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. కొరిసపాడు మండలం తిమ్మనపాలెం, మేదరమెట్ల గ్రామాలలో శనివారం జగనన్న కాలనీలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహాల నిర్మాణంపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. గ్రామాలలో ఇంత సిబ్బంది ఉన్నప్పటికీ కూడా గృహ నిర్మాణాలలో ఆలస్యం ఎందుకు వహిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. కొత్తగా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 90 రోజులలో ఇళ్ల పట్టాలను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రూపులలో లేని స్త్రీలను కూడా గ్రూపుల లోనికి తీసుకుని వారికి బ్యాంకు రుణాలను ఇప్పించి గృహ నిర్మాణాలకు మీరంతా సహకరించాలని ఆమె గట్టిగా అధికారులతో చెప్పారు. కాలనీలకు నీటి వసతి, విద్యుత్ వసతి వంటి వాటిపై సమీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్, జిల్లా పారుదల శాఖ ఎస్ఈ విద్యాసాగర్, మెప్మ పిడి టి రవికుమార్, ఎంపీడీవో డి సురేష్ బాబు, చీరాల ఆర్డీవో సరోజినీ దేవి, డిప్యూటీ తహశీల్దారు రాజశేఖర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ బి ఎలిసెమ్మ, సాదినేని లక్ష్మీకుమారి, సాదినేని మస్తాన్‌రావు, క్రాంతి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

పర్చూరులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్

# శనగల కొనుగోళ్లు త్వరలో ప్రారంభిస్తాం

**ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్**

శనగల కొనుగోళ్లు త్వరలో జరుపుతామని జిల్లా వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ సత్తార్ తెలిపారు. పర్చూరు ఎంపిడిఓ కార్యాలయంలో ఏడిఏ మోహన్‌రావు అధ్యక్షతన సబ్ డివిజన్‌లోని 4 మండలాల ఆర్‌బికె సిబ్బంది, విఏఏలకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ ఈనెలాఖరు లోపు రైతులు సిఎం కిసాన్ ఈకెవైసి చేయించుకోవాలని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలు రావాలంటే రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. త్వరలో శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. క్వింటాకు రూ.5,335 చొప్పున కొనుగోలు చేస్తామని, శనగలు అమ్ముకునే వారు ఈ నెల 31వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేయించాలని విఏఏలకు సూచించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటల పరిస్థితిపై వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి ఎస్ రామమోహన్‌రెడ్డి, ఏఇఓలు పాల్గొన్నారు.

# ఈ క్రాప్ నమోదు ప్రతులు ప్రదర్శన

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

ఈ ఏడాది రబి సీజన్‌కు సంబంధించి జరిగిన ఈ క్రాప్ నమోదు ప్రతులను శనివారం భట్టిప్రోలు గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి చేతుల మీదుగా ఆర్‌బికె సిబ్బంది ప్రదర్శించారు. రైతులు వారి పేర్లను సరిచూసుకొని, మార్పులు చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని పేర్కొన్నారు. సామాజిక తనిఖీ కోసం ఏర్పాటు చేసిన జాబితా ప్రకారం పంట కొనుగోళ్లు, బీమా, నష్టపరిహారం వంటి సౌకర్యాలు కలుగుతాయని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విఏఏలు రజని, రత్నరాజు, నాయకులు చెన్నయ్య తదితరులు ఉన్నారు.

# ప్రైవేటు పాఠశాలల్లో 25 సీట్లు రిజర్వుడు

## లాటరీలో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపిన విద్యాశాఖాధికారి

**ప్రజాశక్తి-సంతమాగులూరు**

వచ్చే విద్యా సంవత్సరంలో ప్రైవేటు విద్యా సంస్థలలో ఒకటో తరగతిలో చేరేందుకుగాను ప్రభుత్వం విధి విధానాలు నిర్ణయించిందని, దాని అమలుకు సహకరించాలని మండల విద్యాశాఖాధికారి వేమవరపు కోటేశ్వరరావు తెలిపారు. శనివారం మండల పరిషత్ సమావేశం హాలులో వెల్ఫేర్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం ప్రైవేట్ పాఠశాలలోని సీట్లలో, అర్హత గల విద్యార్థులు ఒకటో తరగతిలో లాటరీ పద్ధతుల్లో అడ్మిషన్ పొందవచ్చున్నారు. రిజిస్ట్రేషన్ తేదీ ఈ నెల 8వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఏప్రిల్ 9వ తేదీ నుండి 12వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. ఈ సీట్లు అనాథలు, ఎయిడ్స్ బాధితుల పిల్లలకు, వికలాంగులకు 5శాతం ఉంటుందన్నారు. అలాగే ఎస్సీలకు 10 శాతం, ఎస్‌టిలకు 4 శాతం, ఈబీసీలు, బీసీ, మైనార్టీలకు ఆరు శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు సచివాలయాలు, మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం సాంబశివరావు, ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీమా సొమ్ము అందజేత

**ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్**

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సుతో ఆర్థిక భద్రత ప్రజలకు ఉంటుందని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసు అయినవోలు శివరామకృష్ణ సూచించారు. ఇంకొల్లు మండలం హనుమోజీపాలెం గ్రామానికి చెందిన సాదా ఏసమ్మ మృతిచెందగా ఆమె చెల్లించిన రూ.26 వేలకు బీమా సొమ్ము రూ.1,07,342 నామినీ తూమాటి అన్నమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా పోస్టాఫీసులో కల్పిస్తున్న పలు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రైవేటు సంస్థల్లో సొమ్ము చెల్లించి నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ మస్తాన్‌రెడ్డి, బ్రాంచి పోస్టు మాస్టర్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థి మృతిపట్ల ఉపాధ్యాయుల సంతాపం

**ప్రజాశక్తి-పంగులూరు**

మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి, కుంచాల ప్రదీప్ మృతికి శనివారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం తెలియజేశారు. ప్రదీప్ బ్లడ్ క్యాన్సర్‌తో శుక్రవారం మరణించాడు. ప్రదీప్ ఆ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఆ విద్యార్థి జ్ఞాపకాలను తలచుకుని, ఆయన మృతికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుమ్మ శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ కీర్తిశ్రీ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు సంతాపం తెలియజేశారు.

కుంచాల ప్రదీప్ (ఫైల్)

# ఇంటర్ పరీక్షకు 11 మంది గైర్హాజరు

**ఇంకొల్లు రూరల్:** ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా ఇంకొల్లులో శనివారం జరిగిన సీనియర్ పరీక్షల్లో 356 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 345 మంది పరీక్ష రాశారు. 11 మంది గైర్హాజరయ్యారని ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ యు రవికుమార్ తెలిపారు. సోమవారం జూనియర్ ఇంటర్ పరీక్షలకు 460 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. శనివారం పరీక్షల నిర్వహణను ఆర్ఐఓ సైమన్ విక్టర్, డిఇసి మెంబర్ స్వరూపారాణి పరిశీలించారు.

# మినుము పైరును పరిశీలించిన ఏవో

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

ప్రస్తుత పరిస్థితులలో రెండో పంటగా వేసిన మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ పంటలకు ఇప్పటివరకు ఎటువంటి నష్టం జరగలేదని మండల వ్యవసాయ అధికారి టి బాలాజీ గంగాధర్ తెలిపారు. శనివారం చెరుకుపల్లి మండలంలోని నడింపల్లి గ్రామంలో పలు పొలాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతానికి పైరుకు నష్టం లేదని, ఏదైనా చేలలో నీరు నిలబడినట్లయితే, వెంటనే బయటకు పంపివేయాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు తెగుళ్లకు అనుకూలంగా ఉంటాయని, వర్షాలు తగ్గాక ప్రొపికొనాజోల్ ఒక లీటర్ నీటికి ఒక మిల్లి లీటర్ చొప్పున పిచికారీ చేయాలని, లేదా హెక్సాకొనజోల్ లీటర్ నీటికి రెండు మిల్లీలీటర్లు చొప్పున చేనుకు పైపాటుగా పిచికారీ చేయాలని తెలిపారు. మొక్క నీటిలో ఉంటే ఇనుప ధాతులోపం వచ్చే అవకాశం ఉందని, దాని నివారణకు అన్నభేది 10 గ్రాములు, నిమ్మ ఉప్పు ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పైపాటుగా వేయాలన్నారు. అలాగే 20 కిలోల యూరియా, ఐదు కేజీల పొటాష్ చేనుకు పైపాటుగా వేయాలని తెలిపారు.

# చలో అసెంబ్లీని విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

ప్రజాసమస్యలపై పోరాడి ప్రజల పక్షాన నిలబడి ప్రజా సంఘాలు, ప్రతిపక్షాల గొంతు నులిమేసే విధంగా ప్రభుత్వం తీసుకువచ్చిన జిఓ నంబర్ 1ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 20వ తేదీ చలో అసంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి నాగఅంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి జి.ఓ ను వెలికితీసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని జిఓను రద్దు చేసేంతవరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి బాలాజీ, బి శ్రీనివాసరావు, జి దుర్గ తదితరులు ఉన్నారు.

# ఉరేసుకొని వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

దోర్నాల మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారం మేరకు భారత్ పెట్రోల్ బంక్ వెనకాల గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకొని వేలాడుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసు సమాచారం అందించారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు. దోర్నాల వ్యక్తి కాదని ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తి అని స్థానికులు చెబుతున్నారు. పోలీసుల విచారణలో తేలనుంది.

# సైన్స్ కళాశాలకు మృతదేహం దానం

**ప్రజాశక్తి-పంగులూరు**

గుండెపోటుతో మరణించిన మండలంలోని కోటపాడు గ్రామ వాసి, బత్తుల ఏడుకొండలు(55) మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు, వైద్య కళాశాలకు దానం చేశారు. ఏడుకొండలు శనివారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. చనిపోయిన తరువాత పార్థివ దేహం వైద్య కళాశాలలో వైద్య విద్య చదువుకునే విద్యార్థులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఏడుకొండలు సోదరుడు నాగేశ్వరరావు, భార్య రమణ పార్థివ దేహాన్ని దానం చేసేందుకు ఒప్పుకున్నారు. వెంటనే అమ్మ నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహక సంఘం వ్యవస్థాపకులు, గంజి ఈశ్వర లింగం సహకారంతో విజయవాడ (ఎన్ఐఎమ్ఎస్) నిమ్స్ కళాశాల, నిమ్రా ఇనిస్టూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కి శరీరాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు బాధ్యులు తాటి చిన్న సుబ్బారావు, గ్రామ మాజీ సర్పంచ్ యర్రం గోపాలరెడ్డి, ప్రోత్సాహక సంఘం కన్వీనర్ చలపతిరావు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మృతిచెందిన ఆశా వర్కర్ లక్ష్మి

# రోడ్డు ప్రమాదంలో ఆశా వర్కర్ మృతి

## మరొకరికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-సంతమాగులూరు**

మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ గుంటూరు లక్ష్మి(35) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. అందిన వివరాల ప్రకారం.. ఆశా వర్కర్ గుంటూరు లక్ష్మి, మరొక ఆశా వర్కర్ పత్తిపాటి శాంతి, ఇరువురు సంతమాగులూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్షా సమావేశంలో పాల్గొని, అనంతరం వారి సొంత పనుల మీద నరసరావుపేటకు స్కూటీపై వెళ్లారు. నరసరావుపేటలో పనులు ముగించుకుని తిరిగి స్కూటీపై ఏల్చూరు గ్రామానికి వస్తుండగా, పల్నాడు జిల్లా, ఉప్పలపాడు గ్రామ సమీపంలో గుంటూరు కర్నూలు రహదారిపై ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. దీంతో స్కూటీ నడుపుతున్న లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ వెనుకాల కూర్చున్న పత్తిపాటి శాంతికి తీవ్ర గాయాలయ్యాయి. శాంతి నరసరావుపేట హాస్పిటల్ లో చికిత్స పొందుతుంది. మృతి చెందిన లక్ష్మికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పది సంవత్సరాలుగా ఆశ వర్కర్‌గా ఏల్చూరులో విధులు నిర్వహిస్తోంది. లక్ష్మి మృతి పట్ల ఏల్చూరులో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## బూదవాడ విద్యార్థి ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయికి ఎంపిక

**ప్రజాశక్తి-పంగులూరు**

మండలంలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వలేరు సతీష్ చేసిన "మస్కిటో కిల్లర్, వితవుట్ కెమికల్ "అనే ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యిందని పాఠశాల ప్రధానిపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత శనివారం తెలిపారు. సతీష్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థికి గైడ్ టీచర్‌గా సీహెచ్ లక్ష్మీ నారాయణ పనిచేశారు. సతీష్ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల సతీష్‌ను, లక్ష్మి నారాయణను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు. ఈ పాఠశాల విద్యార్థులు చేసిన ఇన్‌స్పైర్ రాష్ట్ర స్థాయికి ఎంపిక అవడం ఇది రెండోసారి. గతంలో ఇదే పాఠశాలకు చెందిన గైడ్ టీచర్‌గా సోమశేఖర్, గుంజి లికేష్ అనే విద్యార్థి 2020-21లో తయారు చేసిన ప్రాజెక్ట్ కూడా రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యింది. అలాగే ఇఎమ్‌డిపి కార్యక్రమంలో బి శివాని, ఎమ్ సాద్వికలు తయారు చేసిన ప్రాజెక్ట్ జిల్లా స్థాయికి ఎంపిక అయ్యింది. ఆ విద్యార్థులకు గైడ్ టీచర్‌గా వ్యవహరించిన ఎన్ సుధావాణిని ఉపాధ్యాయులు అభినందించారు.

తయారు చేసిన ప్రాజెక్ట్‌తో విద్యార్థి వలేరు సతీష్

## రాష్ట్రస్థాయికి ఎంపికైన సైన్స్ ప్రాజెక్ట్

**ప్రజాశక్తి-వేటపాలెం**

మండల పరిధిలోని పందిళ్లపల్లి జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపకల్పన చేసిన బహుళార్ధక ప్రయోజనాలు చేకూర్చే ఓవెన్‌తో కూడిన సైన్స్ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఇటీవల ఆన్‌లైన్లో ఈ పోటీలు నిర్వహించగా ఉమ్మడి ప్రకాశం జిల్లా తరపున ఈ ప్రాజెక్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభ కార్యక్రమంలో ఈ ప్రాజెక్ట్ రూపకల్పన చేసిన తొమ్మిదో తరగతి విద్యార్థి దేవరకొండ విజయకుమార్, గైడ్ ఉపాధ్యాయిని బి నిర్మలా దేవిలను ప్రధానోపాధ్యాయులు బి వెంకటేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయులు ఎం శేఖర్‌రావు, ఎస్ విజయవర్ధన్‌రావు, వి నళిని కుమారి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

సైన్స్ ప్రాజెక్టుతో ఉపాధ్యాయిని, విద్యార్థి

బీమా చెక్కు అందజేస్తున్న పోస్టల్ ఇన్సూరెన్స్ సిబ్బంది

## పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌తో ఆర్థిక భద్రత

**ప్రజాశక్తి-వేటపాలెం:** గత 160 సంవత్సరాలుగా ప్రజలకు విరివిగా సేవలందిస్తున్న మన పోస్టాఫీసులో 'జీవిత బీమా' సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకొని వారి కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించాలని చీరాల సబ్ డివిజన్ పోస్టల్ ఎఎస్‌పి ఐ శివరామకృష్ణ, వేటపాలెం సబ్ పోస్ట్‌మాస్టర్ ఎల్ శ్రీనివాసరావు, రావూరిపేట సబ్ పోస్టుమాస్టర్ పి గోపికృష్ణ, పందిళ్లపల్లి సబ్ పోస్టుమాస్టర్ ఎన్ గంగాధర్‌రావు శనివారం నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో తెలిపారు. ఈ సందర్భంగా చీరాల ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ డెంగ్యూ వ్యాధితో మరణించిన పోకూరి రవి కుటుంబానికి పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా కేవలం రూ.2,79,000/- కట్టగా వారికి చేకూరిన లబ్ధి మేరకు రూ.11,68,000/- చెక్కును వారి సతీమణి పోకూరి శిరీషకు అందజేశారు. ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ పొందవచ్చని తెలిపారు. చాలా తక్కువ కాలవ్యవధి ప్రీమియం చెల్లించినప్పటికీ ఎక్కువ మొత్తంలో వారికి లబ్ధి చేకూరినందుకుగాను పోకూరి శిరీష పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేక కృతజ్ఞత తెలిపారు. ప్రజలందరూ 24-03-2023 నాడు గ్రామీణ తపాలా బీమా దినోత్సవం పురస్కరించుకుని పోస్టాఫీసు ఇన్సూరెన్స్ ఉపయోగించుకోవాలని ఐ శివరామకృష్ణ కోరారు.

# సీపీఎస్ రద్దు చేయండి మహాప్రభో!

### ఓపిఎస్ పెన్షన్ అమలు చేయాలి ● బాపట్లలో ఏపీ జేపీసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల నిరసన ప్రదర్శన

**ప్రజాశక్తి-బాపట్ల రూరల్**

సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఏపీ జేపీసీ అమరావతి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక విశ్రాంత కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి ఏపీ జేపీసీ అమరావతి ప్రకటించిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా శనివారం బాపట్ల తాలూకా కార్యాలయం వద్ద రెవెన్యూ శాఖ, హౌసింగ్ శాఖ, ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, ఎంపీడీవో తదితర శాఖల కార్యాలయాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆయా సంఘాల నాయకులను, ఉద్యోగుల్ని ఉద్దేశించి ఏపీ రెవెన్యూ అసోసియేషన్ బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సిహెచ్ సురేష్‌బాబు, జిల్లా కోశాధికారి బి ఓంకార్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం మాకు కేటాయించిన బడ్జెట్‌లోని మొత్తాలను మాకు ఎందుకు చెల్లించదు అని ప్రశ్నించారు. వృద్ధాప్యంలో ఆర్థిక భద్రతగా ఉంటుందని ప్రభుత్వం వద్ద దాచుకున్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర డబ్బుల్ని కూడా ఒఒకు ఇవ్వకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఈ సందర్భంగా ఆవేదన చెందారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులకి పిలుపునిస్తూ మన న్యాయమైన కోరికల పరిష్కారానికి మాత్రమే మనం ఉద్యమం చేస్తున్నామని, ప్రజాస్వామ్యంలో ఉద్యమం ప్రజల హక్కని, మనకు రావాల్సిన ఆర్థికపరమైన చెల్లింపులు, ఇతర సమస్యలు పూర్తిగా నెరవేర్చే వరకు ఈ ఉద్యమం ఆగదని, ప్రతి ఒక్క ఉద్యోగి చిత్తశుద్ధితో ఉద్యమ కార్యాచరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, డిప్యూటీ తహశీల్దారు శ్రీదేవి, ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు పెరుగు శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి కె విజయ్‌చంద్, కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, ఏ శివరామకృష్ణ, జి సాయి, పి శ్రీలక్ష్మి, డి శ్రీనివాసరావు, పి సురేష్ బాబు, డి వెంకటేశ్వరరావు ఎం రాజిమ్మ, వివిధ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

## అరాచకమైతే తిరుగుబాటు తప్పదు

### అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

**ప్రజాశక్తి-అద్దంకి**

తూర్పు, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజలు జగన్‌రెడ్డి మాకొద్దని స్పష్టంగా తీర్పునిచ్చారు. జగన్‌రెడ్డి ఇకనైనా విశాఖ రాజధాని అనే ప్రేలాపనలు మానుకోవాలి. ప్రజా క్షేత్రంలోకి రావాలంటే వెన్నులో వణుకు పుట్టేలా ఎన్నికల ఫలితాల ప్రజా తీర్పు వెలువడిందని అన్నారు. మూడు రాజధానుల మాయమాటలతో అభివృద్ధి అనే ముసుగులో వైసీపీ నేతలు రాష్ట్రాన్ని దోచేశారు. రాష్ట్ర యువత వారి భవిత బాగుండాలంటే తెలుగుదేశం పార్టీతోనే అది సాధ్యపడుతుందన్నారు. వైసీపి పరిపాలనతో రాష్ట్ర ప్రజానీకం విసిగి వేసారిపోయి ఉన్నారు. శనివారం ఫలితాలతో రానున్న రోజులలో వైసీపి పార్టీ పతనానికి రాష్ట్ర ప్రజానీకం ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారన్నారు. ప్రపంచ దేశాల నేతలు గర్వించదగిన నేత, యువత భవితకు విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు గారిని ముఖ్యమంత్రిగా కావాలని ఈ రాష్ట్రంలోని విద్యావంతులు, సామాన్యులు కోరుకుంటున్నారన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని, అధికారులను చెప్పుచేతల్లో పెట్టుకొని అక్రమ విజయాలు సాధించారన్నారు. పట్టభద్రుల కానివారిని సైతం ఓటర్లుగా నమోదుచేసి దొంగఓట్లు వేయించి దాడులు చేసినా టీడీపీ కార్యకర్తలు, నాయకులు ప్రాణాలు ఒడ్డి శ్రమించారని తెలిపారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా పట్టభద్రులు వెరవక ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఓట్ల రూపంలో చూపించారని అన్నారు. అధినాయకుని స్ఫూర్తితో, కార్యకర్తల కష్టంతో, ఉపాధ్యాయుల తోడ్పాటుతో, పట్టభద్రుల నిర్ణయంతో వచ్చిన ఈ విజయం రాబోయే రోజుల్లో రాష్ట్ర భవిష్యత్తును మార్చనుందని ఇదే జోరుతో 2024లో చంద్రన్నని ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో కూర్చోబెడదామని ఎమ్మెల్యే గొట్టిపాటి శ్రేణులకు పిలుపునిచ్చారు.

## 5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

### ప్రజా సంఘాల పిలుపు

**ప్రజాశక్తి-బాపట్ల**

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపును జయప్రదం చేయాలని కోరుతూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం, సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో శనివారం ప్రజాసంఘాల కార్యాలయంలో కరపత్రాల ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రైతు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశంలో బడా కార్పొరేట్లకు అండగా ఉంటుందన్నారు. అదాని, అంబానీలకు దేశ సంపదను దోచిపెట్టే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. రైతులకు కనీసం మద్దతు ధర పెంపు, విద్యుత్తు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్లో చట్టం చేస్తామని ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. కార్మిక చట్టాలను పూర్తిగా మార్పు చేస్తామన్న ప్రకటన అమలు జరగలేదు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5 ఢిల్లీలో జరిగే మహా ధర్నాకు పెద్ద ఎత్తున రైతులు కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 21 నుండి అన్ని గ్రామాల్లో విస్తతంగా కరపత్రాలు పంపిణీ చేస్తూ సామూహిక సమావేశాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఆర్ వినోద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి కృష్ణమోహన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు..

# విద్యార్థులు క్రీడలలో రాణించాలి

**ప్రజాశక్తి-దరిశి**

విద్యార్థులు క్రీడలలో రాణించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. శనివారం మండల స్థాయిలో స్థానిక ప్రశాంతి హైస్కూల్లో జరిగిన కబడ్డీ పోటీలకు ముఖ్యఅతిథిగా పాల్గొని బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి క్రీడలకు ఎంతో ప్రోత్సాహమిస్తున్నారని, అవసరమైన చోట క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. క్రీడలు ప్రశాంత వాతావరణంలో ఆడాలన్నారు. ఈ సందర్భంగా 12 టీమ్‌లు బాలురు, బాలికలు 6 టీమ్‌లు ఆడనున్నట్లు పిడి సోమా అంజిరెడ్డి తెలిపారు. చందలూరు ఎస్‌విఆర్ స్కూల్ విద్యార్థులు ఆడుతున్న సందర్భంగా వర్షం వచ్చి క్రీడా ప్రాంగణం తడిగా ఉండటంతో ఆటలు రద్దు చేశారు. వాతావరణం అనుకూలిస్తే ఆదివారం జరుగుతాయని పిడిలు అంజిరెడ్డి, ప్రసన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, షేక్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరు ఎస్ఎం బాషా, వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపిపి ఇత్తడి దేవదానం, నాయకులు చింతలపూడి శ్రీనివాసరెడ్డి, సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

# పోషక విలువలున్న ఆహారం తీసుకోండి

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్
- ఒంగోలులో మిల్లెట్ మేళా ప్రారంభం

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడంపై ప్రతి ఒక్కరూ దష్టి పెట్టాలని కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. రోగాల బారినపడి మందులు వేసుకోవడం కంటే మనం తీసుకునే ఆహారమే శరీరానికి ఔషధంలా పనిచేసేలా చూసుకోవాలన్నారు. ఈ దిశగా మనకు అందుబాటులో ఉన్న అధిక పోషక విలువలతో కూడిన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఆయన సూచించారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించడంతో "ఈట్ రైట్ ఇండియా-మిల్లెట్ మేళా" కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాల వినియోగాన్ని పెంచేలా ప్రజలకు అవగాహన కల్పించడానికి శనివారం స్థానిక గాంధీ పార్క్ లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ నుంచి గాంధీ పార్క్ వరకు ప్రత్యేక ర్యాలీ నిర్వహించగా, సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

మాట్లాడుతూ నాటి ఈ తరానికి చిరుధాన్యాలే ప్రధాన ఆహారమని, హరిత విప్లవంతో దేశంలో బియ్యం, గోధుమల ఉత్పత్తి పెరిగి చిరుధాన్యాలను వినియోగించే వారి సంఖ్య తగ్గిందన్నారు. కానీ ఎలాంటి రసాయనాలు, పురుగు మందుల అవసరం లేకుండా వర్షాధారంగా సాగుచేసే చిరుధాన్యాలలో పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో చిరుధాన్యాలను ప్రతి ఒక్కరూ ఆహారంగా తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పించేలా రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రకాశం జిల్లాలో ఈ విధమైన మేళా నిర్వహించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ సందర్శించి మిల్లెట్స్ తో చేసిన స్నాక్స్, ఇతర పదార్థాలను ఆసక్తిగా రుచి చూశారు. 'ప్రకతి వనం' ప్రసాద్ మాట్లాడుతూ చిరుధాన్యాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ప్రభాకరరావు, కేంద్ర ప్రభుత్వ ఫుడ్ సేఫ్టీ అధికారి సయ్యద్ అబ్దుల్, ఒంగోలు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపికి ఆదరణ

### డాక్టర్ నూకసాని బాలాజీ

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని పట్టభద్రులు గెలిపించారని తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. వైసిపి ప్రభుత్వ విధానాల్లో విద్యావంతులైన మేధావి వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్న విషయం ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైందన్నారు. వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల విధానాన్ని మేధావులు ఈ ఎన్నికల ద్వారా తిరస్కరించారన్నారు.. 108 నియోజకవర్గాల్లో పట్టబద్రులు తెలుగుదేశం పార్టీని ఆదరించారని, టిడిపికి ఆదరణ పెరిగిందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయలేదని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, నిరుద్యోగులను మోసం చేసిన వైసిపి ప్రభుత్వానికి పట్టభద్రులు ఓటు ద్వారా బుద్ధి చెప్పారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర లో వేపాడ చిరంజీవి, తూర్పు రాయలసీమ లో కంచర్ల శ్రీకాంత్, పశ్చిమ రాయలసీమ లో భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి లను గెలిపించిన పట్టభద్రులకు బాలాజీ కృతజ్ఞతలు తెలిపారు.

## 10 ట్రాన్స్‌ఫార్మర్లకు ఒక్కరోజులో మరమ్మతులు

**ప్రజాశక్తి-త్రిపురాంతకం**

వడగండ్ల వానకు త్రిపురాంతకంలో కరెంటు తీగలు తెగిపడ్డాయి. సుమారు 10 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. వెంటనే స్పందించిన లైన్‌మెన్ పాతంగి జయరాం అంతా తానై వర్షాన్ని సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించారు. 10 ట్రాన్స్ ఫార్మర్‌లకు ఒక్క రోజులోనే మరమ్మ తులు చేసి అందరి మన్నలు పొందాడు.

మరమ్మతులు చేస్తున్న జయరాం

# నాడు-నేడు పనులు వేగవంతం: ఎంఇఒ

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని ఎంఈవో పి ఆంజనేయులు తెలిపారు. శనివారం ఆయన మండలంలోని వాదంపల్లి ఎంపియూపి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. నాడు-నేడు పథకం ద్వారా రావలసిన నిధులు వచ్చాయి కనుక పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు తరగతి గదులు అందుబాటులోకి తీసుకురావాలని అదేశించారు. కొత్త స్థలంలో త్వరగా పనులు మొదలు పెట్టాలన్నారు. విద్యార్థులు యూనిఫాం, బూట్లు అందరూ ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల వర్క్ బుక్స్ రాయించి కరెక్షన్ చేయాలన్నారు. రాగి మాల్ట్, మధ్యాహ్న భోజనాన్ని రుచిగా ఉండేలా తయారు చేయించాలని ఆదేశించారు. అనంతరం టీచర్స్ లెసన్ ప్లాన్స్, డైరీలు పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజు, జ్యోతీ రేణుక, సిఆర్‌పి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎంఇఒ

ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి దానమ్మ

## సబ్ జైలు పరిశీలన

**ప్రజాశక్తి-గిద్దలూరు**

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారా దానమ్మ అన్నారు. గిద్దలూరు సబ్ జైలును శనివారం సందర్శించారు. ఖైదీలతో మాట్లాడుతూ జైలు జీవితంతో లభించే విరామ సమయంలో గతంలో చేసిన తప్పులను గుర్తు చేసుకుంటూ నేర ప్రవృత్తికి దూరమయ్యేలా, కుటుంబం కోసం జీవించేలా పరివర్తన చెందాలన్నారు. జైలు ఆసాంతం పరిశీలించి వసతులను తనిఖీ చేశారు. ఖైదీలను జైలులో ఏమైనా సమస్యలున్నాయా.? అని అడిగి తెలుసుకు న్నారు. ఎవరైనా న్యాయవాదిని నియమించుకోలేని స్తోమత ఉంటే, వారికి న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.బాలరాజు, ఎం.పిచ్చయ్య, జి.ఆనంద్, పారాలీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధనరావు, కోర్ట్ సిబ్బంది వరలక్ష్మి, కాశి తదితరులు పాల్గొన్నారు.

ప్యాడ్‌లు అందజేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షులు

## 'పది' విద్యార్థులకు ప్యాడ్‌లు పంపిణీ

**ప్రజాశక్తి-చీమకుర్తి**

చీమకుర్తి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 140 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పంపిణీ చేశారు. ప్యాడ్‌లను ధరణీ అపార్టుమెంట్స్ ప్రసాదరెడ్డి, పెన్నులను రోటరీక్లబ్ అధ్యక్షులు గొల్లపూడి చౌదరి, పెన్సిళ్ళను యువపారిశ్రామికవేత్త శిద్దా సుధాకర్ సమకూర్చారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ నాయకులు మాట్లాడుతూ పాఠశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి చౌదరి, తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు యడ్లపల్లి రామబ్రహ్మం, గొల్లపూడి వెంకటరావు, ఎం చలమయ్య, ప్రధానోపాధ్యాయులు డి సుబ్బారావు, ఓబులు, ఉపాధ్యాయులు నల్లూరి వెంకటేశ్వరరావు, చల్ల శ్రీను, శివపార్వతి పాల్గొన్నారు.

# గిరిజన గూడేల్లో ఉచిత వైద్యశిబిరం

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల బిళ్లగొంది, పోతురాజుపెంట, గౌతమ బుద్ధిని కాలనీలలో శనివారం వెంకటాద్రిపాలెం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి కోటా నాయక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణీలకు, చిన్నారులకు టీకాలు వేశారు. రక్తహీనతతో బాధపడే రోగులకు ఐరన్ మాత్రలు, ప్రొటీన్ పౌడర్లు పంపిణీ చేశారు. చర్మ వ్యాధులకు చికిత్సలు అందించి ఆరోగ్య విద్యను బోధించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగలక్ష్మి, రమణమ్మ, శ్రీవాణి, నలగాటిఒ వెంకట్రామయ్య నాయుడు, లక్ష్మీదేవి, అంకమ్మ, గురవమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దోర్నాలలో భారీగా నిలిచిన వాహనాలు

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రం నుంచి శ్రీశైలం వెళ్లే భక్తుల వాహనాలను రాత్రిపూట గణపతి చెక్‌పోస్టు వద్ద నిలిపివేశారు. దీంతో సుమారు మూడు కిమీ మేర 300 దాకా వాహనాలు నిలిచిపోయాయి. శ్రీశైలంలోని భ్రమరాంబ దేవిది కర్ణాటక రాష్ట్రం పుట్టినిల్లు కావడంతో ఉగాదికి కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలం వస్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం కూడా భారీ వాహనాలతో రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది, ఉదయాన్నే పోలీసులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా శ్రీశైలానికి పంపారు.

# భూరక్ష సర్వేపై అవగాహన కల్పించాలి

డిపిఒ నారాయణరెడ్డి

**ప్రజాశక్తి-కొత్తపట్నం**

కొత్తపట్నం మండల పరిధిలోని రంగాయపాలెంలో డిపిఒ నారాయణరెడ్డి శనివారం పర్యటించారు. ముందుగా జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష సర్వేలో భాగంగా ఓఆర్ఐ మ్యాప్ పరిశీలించి, సర్వే విధానం గురించి పంచాయతీ కార్యదర్శి, విలేజ్ సర్వేయర్‌లకు అవగాహన కల్పించారు. భూరక్ష సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివద్ధి అధికారి, విస్తరణాధికారి, పంచాయతీ కార్యదర్శి , సర్వే టీం, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూసర్వేను పరిశీలిస్తున్న డిపిఒ నారాయణరెడ్డి

## ఎరువుల విక్రయాలు నిలిపివేత

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

పెద్దదోర్నాల మండలంలోని ఎరువుల దుకాణాలను అంతర్గత తనిఖీలో భాగంగా శనివారం మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు రమాదేవి ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఫారం ఓలు లైసెన్సు నందు పొందుపరచని పలు రకాల ఎరువుల అమ్మకాల ను నిలుపుదల చేశారు. వాటి విలువ రూ. 4,91,599లు ఉంటుందని చెప్పారు. అలాగే రైతులు ఎరువులు కొనుగులు చేయునప్పుడు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. స్టాక్ బోర్డులో స్టాకు వివరాలు పొందుపరిచలని, ఎంఆర్‌పి ధరలకే ఎరువులు అమ్మాలని తెలియజేశారు. ఈ అంతర్గత తనిఖీలో మార్కాపురం ఏవో, టెక్నికల్ చంద్రశేఖర్, స్థానిక మండల వ్యవసాయ అధికారి జవహర్‌లాల్ నాయక్ పాల్గొన్నారు.

# 108 ఫీడర్ అంబులెన్స్ సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

ఐటీడీఏ పరిధిలోని గిరిజన పీహెచ్‌సీలలో అందుబాటులో ఉన్న 108 ఫీడర్ అంబులెన్స్ సేవలు అభినందనీయమని ఆ సేవలను ఇంకా మెరుగుపరచాలని శ్రీశైలం ఐటీడీఏ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం శ్రీనివాసరావు తెలిపారు. శనివారం దోర్నాల లోని శివ సదన్ భవనం నందు శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని 108 ఫీడర్ ఇఎంటిలకు ఫీడర్ ఈఎంఈ అనిల్ కుమార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 108 ఫీడర్ వాహనాలను పరిశీలించారు. ఈఎంటిల రికార్డులను తనిఖీ చేశారు. వాహనాల పనితీరును, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన గుడాలలో అనారోగ్యానికి గురైన వారిని సకాలంలో పిహెచ్‌సీలకు చేర్చాలన్నారు. 108 ఫీడర్ అంబులెన్స్ సేవలు ప్రతి మారుమూల గూడెంనకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వాహన ఇఎంటిలు, తదితరులు పాల్గొన్నారు.

## 'కస్తూరిబా'లో దంత వైద్యపరీక్షలు

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

ప్రపంచ ఓరల్ హెల్త్ డేలో భాగంగా పెద్దదోర్నాల్లోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో దంత సమస్యలపై శనివారం దంత వైద్య అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్యాధికారిణి డాక్టర్ కళాసంధ్య ఆధ్వర్యంలో విద్యార్థినులకు దంత సమస్యలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దంతాల విషయంలో పరిశుభ్రత పాటించాలని, పంటికి సంబంధించిన ఇబ్బందులు ఉన్నప్పుడు దగ్గరలోని దంత వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రిన్సిపల్ అనూష, ఆరోగ్య మిత్ర రాంబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపి సంబరాలను అడ్డుకున్న ఎస్‌ఐ

**ప్రజాశక్తి-పొదిలి**

తూర్పు, రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ విజయం సందర్భంగా సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు, కార్యకర్తలను ఎస్‌ఐ మల్లికార్జునరావు శనివారం అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, టిడిపి నేతలకు మధ్య వాగ్వివాదం జరిగింది. శ్రీకాంత్ గెలుపు సందర్భంగా మాజీ సర్పంచ్ కాటూరి నారాయణప్రతాప్ ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్వనాథపురం సెంటర్‌లో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హజరై కేక్ కట్ చేసేందుకు గుమిగూడారు. ఎస్‌ఐ మల్లికార్జున అక్కడికి చేరుకుని ఈ సంబరాలకు అనుమతి లేదంటూ వారిని అడ్డుకున్నారు. దీంతో టిడిపి నాయకులు ఎస్‌ఐతో వాగ్వివాదానికి దిగారు. బాణసంచా కాల్చడానికి అనుమతి లేదని, ర్యాలీతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందంటూ టిడిపి నాయకుల చేతుల్లో ఉన్న బాణసంచాను ఎస్‌ఐ లాక్కున్నారు. తాము సంబరాలు చేసుకునే హక్కు లేదా అంటూ టిడిపి నేతలు ప్రశ్నించారు. అనంతరం విశ్వనాథపురం సెంటర్‌లో కేక్ కట్ చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. కేక్ కట్ చేసిన అనంతరం టీడీపీ కార్యకర్తలు ర్యాలీగా పార్టీ కార్యాలయానికి బయలుదేరారు. ఈ సందర్భంగా బాణసంచా పేల్చడంతో మరోసారి టిడిపి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. నిబంధన అతిక్రమిస్తే అరెస్ట్ చేస్తామని మరోసారి ఎస్‌ఐ హెచ్చరించడంతో టిఎన్‌ఎస్ జిల్లా కార్యదర్శి గౌస్ బాషా, మరికొందరు కార్యకర్తలు ఎస్‌ఐ తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించారు. తర్వాత కొందరు నాయకులు సర్ధి చెప్పి పంపించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, ఫుడ్ కమీషన్ మాజీ సభ్యురాలు, మాజీ సర్పంచ్ స్వర్ణగీత, మండల టిడిపి అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు యర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్ (పండు చికెన్), శివాలయం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ శామంతపూడి నాగేశ్వరరావు, ఎస్‌కె రసూల్, సయ్యద్ ఇమాం సాహెబ్, ఎస్‌కె మస్తాన్ వలి, జ్యోతి మల్లికార్జున రావు, బాధం రవి, ఎస్‌కె షబ్బీర్, షాహిద్, వీరిశెట్టి సురేష్, రమేష్, మెట్టు వెంకటరెడ్డి, మౌలాలి పాల్గొన్నారు.

**నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వివాదం**

ఎస్‌ఐతో టిడిపి నాయకుల వాగ్వివాదం

# కనిగిరిని కనకగిరిగా మార్చేందుకు కృషి

**ముస్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్**

**ప్రజాశక్తి-కనిగిరి**

కనిగిరిని కనకగిరిగా మార్చేందుకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ సహకారంతో నిరంతరం శ్రమిస్తున్నట్లు కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలియజేశారు. మున్సిపల్ ఛైర్మన్‌గా రెండు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజారంజకపాలన సాగుతోందన్నారు. ప్రజలు సంతోషంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావటం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్‌లు పులి శాంతి, మాణిక్యరావు, కౌన్సిలర్లు తమ్మినేని సుజాతరెడ్డి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న అబ్దుల్ గఫార్

**ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు**

# టిడిపి శ్రేణుల్లో జోష్‌ను నింపాయి

**ప్రజాశక్తి-కనిగిరి**

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు టిడిపి శ్రేణుల్లో జోష్‌ను నింపాయని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలియజేశారు. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యావంతులు విజ్ఞతతో నిర్ణయం తీసుకొని టిడిపిని ఆదరించి గెలిపించారన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

**యర్రగొండపాలెం:** పట్టణంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ ఘన విజయం సాధించడంతో టిడిపి ఆధ్వర్యంలో శనివారం భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, షేక్ మస్తాన్‌వలి, సుబ్బారావు, మంత్రూ నాయక్, తోటా మహేష్ నాయుడు, షేక్ ఇస్మాయిల్, సత్యనారాయణ గౌడ్, గురిజేపల్లి జిలాని, షేక్ వలి, కామేపల్లి వెంకటేశ్వర్లు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

**టిడిపి కనిగిరి ఇన్‌ఛార్జి ఉగ్రనరసింహారెడ్డి**

మాట్లాడుతున్న ఉగ్ర నరసింహారెడ్డి

**త్రిపురాంతకం:** కంచర్ల శ్రీకాంత్ విజయం సాధించడంతో శనివారం టిడిపి నాయకులు కోటగట్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపిపి నాసర్‌రెడ్డి విగ్రహం వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు మేకల వలరాజు, చలమయ్య, ఆంజనేయులు, అల్లూరెడ్డి, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, వెంకట నారాయణ, బాల నాసర్, అయ్యప్ప, వెంకటరెడ్డి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దదోర్నాల:** శ్రీకాంత్ విజయం సాధించడంతో టిడిపి ఆధ్వర్యంలో శనివారం దోర్నాల పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అంబటి వీరారెడ్డి, భట్టు సుధాకర్ రెడ్డి, శేషాద్రి, నాగేంద్రబాబు, ఈదర మల్లయ్య, బాషా, మాబు, ఇస్మాయిల్, సుబ్బరత్నం, శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు.

**పెద్దారవీడు:** 2024లో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టిడిపి ఎర్రగొండపాలెం ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని దేవరాజు గట్టులో తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయం ఆవరణలో పార్టీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గొట్టం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

## దేవస్థానం అభివృద్ధికి పూర్తి సహకారం

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

మండలంలోని పాత శింగరాయకొండ శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి తమ కుటుంబం నుంచి పూర్తి సహకారం ఎప్పుడూ ఉంటుందని చీరాల మాజీ శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్ సోదరులు, ఆమంచి స్వాములు, తనయుడు ఆమంచి రాజేంద్ర అన్నారు. శనివారం నాడు దేవస్థానం వద్ద శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి మెట్లతో పాటు అభివద్ధి చేసేందుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆమంచి రాజేంద్ర ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించి.. మాట్లాడారు. శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివద్ధికి కోటి రూపాయలైనా తమ కుటుంబం నుంచి ఖర్చు పెడతామని వివరించారు. వీరి వెంట దేవస్థానం ఛైర్మన్ పామర్తి మాధవరావు, కార్యనిర్వహణాధికారి పి.కష్ణవేణి, కమిటీ సభ్యులు రాజు కోటేశ్వరి, గోకరాజు పాపయ్య నాయుడు, ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహచార్యులు ఉన్నారు.

## ఢిల్లీ లిక్కర స్కామ్ కేంద్రం కుట్ర

**వైసీపీ నాయకులు షేక్ నాసీర్**

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

విపక్షంలో ఉన్న బలమైన నాయకులను ఇబ్బంది పెట్టే క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం ఈ లిక్కర్ వ్యవహారాన్ని వాడుకుంటోందని వైసీపీ నాయకులు షేక్ నాసీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తున్నా.. నిజాయతీగా ఢిల్లీ ప్రభుత్వంతో వ్యాపారం చేస్తున్న మాగుంట కుటుంబానికి సంబంధం లేని ఈ కేసులలో ఇరికించే కుట్ర జరుగుతోందన్నారు. మాగుంట కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థల్ని వాడుకోవడం సిగ్గుచేటన్నారు. త్వరలో మాగుంట కుటుంబం ఎలాంటి తప్పూ చేయలేదని నిరూపితమవుతోందన్నారు.

ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

## శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షల సాయం

**ప్రజాశక్తి-మద్దిపాడు**

యూట్యూబ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీదేవి మండల పరిధిలోని గార్లపాడు గ్రామానికి చెందిన ముత్తనపల్లి రమణమ్మకు ఇంటి శంకుస్థాపన సమయంలో రూ.6 లక్షల ఆర్థిక సాయం శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు బెజవాడ రాము, సర్పంచ్ గంగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పైనం ప్రభాకర్ పాల్గొన్నారు.

## వైసిపి భూస్థాపితానికి శ్రీకారం

**ప్రజాశక్తి-హనుమంతునిపాడు**

ఎపిలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ భూస్థాపితానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు శ్రీకారం చుట్టారని హనుమంతునిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. శాసనమండలి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయ దుందుభిపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో తెదేపా నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు అభిమానులతో కలిసి బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో గాయం రామిరెడ్డి, మురహరి నరసయ్య, గంటా శ్రీనివాసరెడ్డి, గంగిరెడ్డి రమేష్‌రెడ్డి, కోటపాటి శేషయ్య, కూడలి దశరథ, రఘునాథ కాశిరెడ్డి, కోటయ్య పాల్గొన్నారు.

## ముఖ యాప్‌లో నమోదు కాకపోతే చర్యలు

**ప్రజాశక్తి-జరుగుమల్లి**

ఎంపిడిఒ పి.రామకృష్ణ

మండలంలోని అన్ని సచివాలయాలలో సచివాలయ సిబ్బంది ఖచ్చితంగా ఉదయం, సాయంత్రం ముఖ యాప్‌లో హాజరుకావాలని జరుగుమల్లి ఎంపిడిఒ పి.రామకృష్ణ శనివారం తెలిపారు. ముఖ యాప్‌లో నమోదు కాని వారిపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని మండలంలోని అన్ని సచివాలయ కార్యదర్శులను ఆయన ఆదేశించారు. మండలంలోని 20 పంచాయతీలలో 69 శాతం మాత్రమే సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారని తెలపారు. ప్రకాశం జిల్లాలో .సచివాలయ సిబ్బంది హాజరు శాతంలో చివర సూచికలో వుందన్నారు. సచివాలయ సిబ్బంది నూరు శాతం ముఖ యాప్‌లో హాజరయ్యేలా చూడాలని పంచాయతీ సెక్రటరీలను కోరారు. లేకుంటే సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై తగు చర్యలు తీసుకోనున్నట్లు ఎంపిడిఒ హెచ్చరించారు.

## మానిటరింగ్ బృందం ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి-కంభం రూరల్**

మండలంలోని రావిపాడు సి.ఆర్ మరియు టిఎస్ ప్రాథమిక పాఠశాలలను శనివారం అకడమిక్ మానిటరింగ్ బృందం సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రార్థన సమయం మొదలు పాఠశాల ముగింపు వరకు అన్ని అంశాలనూ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులు విద్యార్థి స్థాయిని అంచనా వేస్తూ బోధన చేయాలని, బోధనోపకరణాల ద్వారా విద్యార్థి నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. జగనన్న గోరుముద్ద మెనూ పరిశీలించి మధ్యాహ్న బోజనాలను రుచి చూశారు. కార్యక్రమంలో విద్యా పర్యవేక్షక బందం సభ్యులు కె.వెంకటరమణయ్య, వై.వీరనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నూతన దంపతులకు 'జంకె' ఆశీర్వాదం

**ప్రజాశక్తి-పొదిలి**

పొదిలికి చెందిన వీఆర్వో కిలారి సుబ్బారావు తనయుడు నరేంద్రనాద్ బాబు-శ్రీవేణి వివాహ మహోత్సవం సందర్భంగా మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైసిపి అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వైసిపి రాష్ట్ర నాయకులు వెన్నా హనుమారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ ఎస్‌కె సైదా పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, మాజీ జడ్పిటిసి సాయి రాజేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం 'ఆసరా'

**ప్రజాశక్తి-హనుమంతునిపాడు**

వైయస్సార్ ఆసరా పేదల పాలిట వరమని వెలుగు సిసి జిలాని పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలోకి వెళ్లి గడపగడపకు వైయస్సార్ ఆసరా గురించి వెలుగు సిసి శనివారం వివరించారు. హనుమంతునిపాడు మండల పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ వైయస్సార్ ఆసరా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి సచివాలయంలో ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా ఆసరా జాబితాను నోటీసు బోర్డుకు అంటించారు.

## దంత సంరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-పొదిలి**

దంత సంరక్షణ పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పొదిలి ప్రభుత్వ వైద్యశాల దంత వైద్యురాలు డాక్టర్ బసంతి అన్నారు. ఈ నెల 20వ తేదీ సోమవారం ప్రపంచ ఓరల్ హెల్త్ డేని పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని బాప్టిస్ట్‌పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎన్‌హెచ్ పి.చౌడేశ్వరి పాల్గొన్నారు.

## ధర్నాను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి-వెలిగండ్ల**

ఈ నెల 20న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వెలిగండ్ల మండల సిఐటియు నాయకులు శనివారం కోరారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ ఎంవి.పార్వతికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెల నెలా వేతనాలు, బిల్లులు చెల్లించడం లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.మాలకొండయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.నారాయణమ్మ, నాగేశ్వరమ్మ, ఉషశ్రీ, రమాదేవి, ఈశ్వరమ్మ, ఖైని, ఎం.ధీనమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వానికి చెంపపెట్టు

## విద్యావంతులైన యువకులు వాస్తవాలు గ్రహించారు: టిడిపి ● బాపట్లలో విజయోత్సవ సంబరాలు

**ప్రజాశక్తి-బాపట్ల**

రాష్ట్రంలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించిన సందర్భంగా బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో శనివారం పట్టణ పార్టీ నాయకులు విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద దేశం శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా పట్టణ దేశం పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. విద్యావంతులైన యువకులు వాస్తవాలు గ్రహించి తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలిచారన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో టీడీపీకి మెజార్టీ రావడం చూస్తుంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపు తథ్యమని అన్నారు. ఇదే ఉత్సాహంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో బాపట్ల నియోజకవర్గంలో ౦నరేంద్రవర్మ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దయాబాబు, ఇషాక్, నల్లమిల్లి నాగేశ్వరరావు, జిట్టా ప్రమీలరాణి, ఆంద్రెయ, విన్నకోట వీరయ్య నాయుడు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి విజయోత్సవంతో బాపట్లలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు..

**బల్లికురవ రూరల్:** తూర్పు రాయలసీమ పట్టభద్రుల దేశం పార్టీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ విజయం సాధించడంతో మండలంలోని అన్ని గ్రామాల నాయకులు బల్లికురవ నాలుగు రోడ్ల కూడలి వద్ద శనివారం సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి, బాణ సంచా కాల్చారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర, తూర్పు రాయల సీమ, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో టిడిపి ఘనవిజయం సాధించడంతో ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందన్నారు. 2024లో జరిగే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని, మరొకసారి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అద్దంకి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్ మరోసారి విజయం సాధిస్తారని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కే ఇజ్రాయిల్, మండల తెలుగు యువత దూళిపాళ్ల హనుమంతరావు, తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సుబ్బారావు, గుంటుపల్లి ఎంపీటీసీ ధూళిపాళ్ల శ్రావణి పున్నారావు, అంబడిపూడి మాజీ సర్పంచి మందలపు సుధాకర్, మలినీడి గోవిందరావు, గొట్టిపాటి లక్ష్మయ్య, గొట్టిపాటి శంకర్, ఏడుకొండలు, ధూళిపాళ్ల వీరాంజనేయులు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్లికురవలో కేక్ తినిపించుకుంటున్న టిడిపి శ్రేణులు

## తాళ్లపాక అన్నమాచార్యుల 520వ వర్ధంతి

**ప్రజాశక్తి-అద్దంకి**

దాస భారతీయ జానపద కళాక్షేత్రం, మరియు తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు వారి 520వ వర్ధంతి శనివారం నిర్వహించారు. టిటిడి దాస సాహిత్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, శింగరకొండ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం మెంబర్ మొరసా సుబ్బారావు, సంగీతం మాస్టారు అడవి వెంకటేశ్వర్లు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి చంద్రమౌళి మాట్లాడారు. అన్నమాచార్య కీర్తనలు భక్తి గీతాలు కాకుండా, సామాజిక స్పృహ కలిగే విధంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమానికి ఘంటసాల గాన భారతి సెక్రటరీ గోగులముడి శేషగిరి, బత్తుల ఆంజనేయులు, బత్తుల బాలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిశేషు

## రేపల్లెలో హౌసింగ్ డే

**ప్రజాశక్తి-రేపల్లె**

రేపల్లె పట్టణంలోని జగనన్న కాలనీలో ఆర్డీవో జగన్నాథం పార్థసారథి హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో స్థానికంగా జగనన్న లే అవుట్లను పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళిక సూచించారు. నూతనంగా నిర్మాణాలు చేపట్టిన ఎస్టీ కాలనీ గృహాల నిర్మాణాలను సందర్శించి త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాల ప్రగతి, మౌలిక సదుపాయాల కల్పనపై గృహ నిర్మాణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గృహ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. కాలనీలో ఇప్పటికే విద్యుత్, నీటి సరఫరా, రోడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతులను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. బేస్‌మెంట్ స్థాయిలోనే ఎగుడు దిగుడు లేకుండా క్రమ పద్ధతిలో సమాంతరంగా నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్ట్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. రెండు పూటలా ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకూ వాటరింగ్ చేస్తూ ఉండాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణాలపై సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులను ఆర్డిఓ జగన్నాథం కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మల్లికార్జునరావు, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హౌసింగ్ డేలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ పార్థసారథి

చెరుకుపల్లిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

## టిడిపి విజయం హర్షదాయకం

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడం హర్షదాయకమని టిడిపి సీనియర్ నాయకుడు దివి రాంబాబు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అత్యధిక స్థానాలకు గెలుపొందడం పట్ల శనివారం చెరుకుపల్లిలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. మండల పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో తెదేపా నాయకులు ఎంఆర్‌కె మూర్తి, మల్లాది రామకృష్ణ, మీర్జా అజీముద్దీన్, నాగుల పున్నారావు, కందుల వెంకటేశ్వరరావు, ఈవూరి దుర్గాప్రసాద్, పఠాన్ మున్నా వీరంకి వెంకట శివ, కొమ్మూరి రాధాకకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల సంక్షేమాన్ని కాలరాస్తున్న సిఎం జగన్

**ప్రజాశక్తి-బాపట్ల**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వికలాంగుల సంక్షేమానికి కేటాయింపులు కాలరాస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వికలాంగులను అవమానపరిచారని భావపురి వికలాంగుల సంక్షేమ సంఘం జనసేన విభాగం అధ్యక్షుడు గోవిందనాది ఆదిశేష ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్ సమావేశంలో వికలాంగుల అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారని పేర్కొన్నారు. పాదయాత్రలో వికలాంగులను ముద్దులు పెట్టుకొని, వాటేసుకొని అక్కున చేర్చుకొని ప్రేమ ఒలకబోసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వికలాంగులకు బడ్జెట్‌లో కేటాయింపులు జరపలేదన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించలేదు. రాష్ట్రంలో దివ్యంగులు నా అన్నదమ్ములు, అక్క చెల్లెమ్మలని వారిపై కపట ప్రేమ చూపారన్నారు. ఇప్పటికైనా వికలాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కంది వెంకటరెడ్డి, గంట నాగమల్లేశ్వరరావు, దేవిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకులు

## 20న విజయవాడలో అంగన్‌వాడీల ధర్నా

**ప్రజాశక్తి-రేపల్లె**

అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై 20వ తేదీన చలో విజయవాడకు తరలి రావాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ పిలుపునిచ్చారు. ఈ మేరకు రేపల్లె ప్రాజెక్టు సిడిపిఒ మాణిక్యంకు వినతిపత్రం సమర్పించారు. ఆనంతరం ఝాన్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అంగన్‌వాడీ వర్కర్స్‌కు ఇచ్చినా హామీ మేరకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు అమలు చేయాలని కొరుతు విజయవాడలో జరిగే ధర్నాలో బాపట్ల జిల్లా పరిధిలో వర్కర్స్, హెల్పర్స్ అందరూ పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్స్‌కు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా నెరవేర్చలేదని అన్నారు. రోజువారీ ధరలు పెద్దఎత్తున పెరుగుతున్నాయని వాపోయారు. తెలంగాణలో 2021 నుంచి 13,600 వేతనం అమలవుతున్నా ఇక్కడ 2019లో ఇస్తున్న వేతనాలనే అమలు చేస్తూ అంగన్‌వాడీల బాధలు పట్టించుకోవటం లేదని అన్నారు. అంగన్‌వాడీలు అప్పు చేసి సెంటర్లు నడపాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రకరకాల యాప్‌లను తీసుకొని వచ్చి పని భారాన్ని పెంచారని అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేయడానికి నిధులను పెంచి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న విజయవాడలో జరిగే మహా ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సిడిపిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

## ఆనందోత్సాహం

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

ఎంఎల్‌సి ఎన్నికలలో టిడిపి విజయం సాధించడం పట్ల శనివారం భట్టిప్రోలు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి మార్కెట్ యార్డ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర నాయకులు టి సాయిబాబా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

## ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరు

**ప్రజాశక్తి-రేపల్లె:** రాష్ట్రంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై జనసేన పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మత్తి భాస్కరరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అరాచక పాలనను తుదముట్టించేందుకు జనసేన పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ మాట్లాడుతూ ఈ నెల14వ తేదీన మచిలీపట్నంలో నిర్వహించిన జనసేన పార్టీ 10వ ఆవిర్భావ సభకు నియోజకవర్గంలోని చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం, రేపల్లె మండలాల నుంచి 10 వేల మంది కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొనటం పార్టీకి శుభ సూచకం అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు జానకి రామయ్య, నగరం మండల ఉపాధ్యక్షులు మండె ప్రసాద్, నాయకులు బత్తుల మల్లి పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

# 20 నుంచి సంపూర్ణ శతావధానం

## కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

శ్రీ శోభకత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో స్థానిక ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో అవధాన విద్యా సరస్వతి డాక్టర్ బులుసు అపర్ణ సంపూర్ణ శతావధానం ఈ నెల 20, 21, 22 తేదీలలో ఏర్పాటు చేసినట్లు క్లబ్ ప్రెసిడెంట్ నైనాల రామకష్ణ తెలిపారు. ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి.. వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ శతావధానం మూడు రోజులు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 6:30 వరకు నిర్వహిస్తామన్నారు. శతావధానం చేసే డా.బులుసు అపర్ణ ఇప్పటికే 260 అష్టావధానాలు, ఐదు శతావధానాలు విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఈ శతావధానంలో పచ్చకులుగా విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తెనాలి, తిరుపతి ప్రాంతాలతో పాటు ఉమ్మడి ప్రకాశంజిల్లాలోని ప్రముఖ కవులు పాల్గొంటారన్నారు. ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, కార్యక్రమ సమన్వయకర్త పొన్నూరు వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ శతావధానం అక్షర క్రీడ అని, 100 మంది కవులు అడిగే సమస్యలను పద్యరూపంలో పూరించటమే కాకుండా చివరి రోజు ఆ పద్యాలను ధారణ చేయటంతో అవధానం ముగుస్తుందన్నారు. గతంలో కొండపి మురళీకష్ణ, నారాయణ బాలసుబ్రమణ్యం జిల్లాలో శతావధానాలు చేశారని, మొట్టమొదటి మహిళా శతావధానాన్ని డా.బులుసు అపర్ణ నిర్వహించబోతున్నారన్నారు. ఈ సంపూర్ణ శతావధానానికి గురు సహస్రావధాని డాక్టర్ కడిమెళ్ళ వరప్రసాద్ సంచాలకులుగా, భువనగిరి పురుషోత్తం వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారన్నారు. మొట్టమొదటి తెలుగు పద్యం పుట్టిన గడ్డపై మహిళ శతావధానం ఏర్పాటు చేసిన నిర్వాహకులు లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ వారిని అభినందించారు. సమావేశంలో క్లబ్ సెక్రటరీ కసిబిసి నాగేశ్వరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ దుగ్గిరెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## 'ఉపాధి హామీ' రక్షణ కోసం..

# చలో ఢిల్లీకి తరలిరండి

## వ్య.కా.స జిల్లా సీనియర్ నాయకులు జాలా అంజయ్య

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

ఉపాధి హామీ చట్టం పరిరక్షణ, కనీస మద్దతు ధరల చట్టం, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం కార్మిక, కర్షక, కష్టజీవుల సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సీనియర్ నాయకులు జాలా అంజయ్య తెలియ జేశారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాలా అంజయ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్షాలు దశాబ్దాలుగా చేసిన పోరాటాల ఫలితంగా 2005లో యుపిఎ ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని చేసిందన్నారు. ఈ చట్టం గ్రామీణ పేదలకు పెద్ద ఆసరాగా ఉందని, కరువు కాలంలో కష్టజీవులకు కడుపు నింపేదిగా ఉందన్నారు. ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు చేస్తున్న కుట్రలను వ్యవసాయ కార్మిక సంఘం నిత్యం ప్రతిఘటిస్తూనే ఉందన్నారు. నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం భారీగా నిధులు తగ్గించి ఆ చట్టాన్ని కనుమరుగు చేసే కుట్రలకు పాల్పడుతుందని, దీనిని అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘాలు చలో ఢిల్లీకి పిలుపునిచ్చిందన్నారు. కష్టజీవులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ఈ చట్టానికి 2007లో 40 వేల కోట్లు బడ్జెట్లో కేటాయించారని, నేడు కనీస వేతనం వంద రూపాయలు మాత్రమే ఉందన్నారు. రూ.257లకు వేతనం పెరిగిందని, ఆ ప్రకారం చూస్తే 1,20,000 కోట్లు బడ్జెట్ కేటాయించాల్సి ఉందన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలన్న, దేశం ఆర్థిక సంక్షోభం నుండి బయట పడాలన్న ఏడాదికి 200 రోజులు పనులు కల్పించాలన్నారు. బడ్జెట్‌లో 2 లక్షల కోట్లు కేటాయించాలని దేశంలోని అనేకమంది మేధావులు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్న మోడీ చెవికెక్కలేదన్నారు. 2021 లో లక్ష కోట్లు కేటాయించి, 2022లో 90 వేల కోట్లకు కుదించారని, నేడు 60 వేల కోట్లకు కోత కోశారని విమర్శించారు. 60 వేల కోట్లలో 15 వేల కోట్లు గత సంవత్సరం బకాయిలు పోతే మిగిలేది కేవలం 45 వేల కోట్లేనని దీనితో ఉపాధి కూలీలకు వేతనాలు సకాలంలో అందక పనులకు దూరమవుతారన్నారు. కూలీలు పనులకు రావటం లేదనే కారణంతో ఉపాధి చట్టాన్ని కనుమరుగు చేసే కుట్రకు బిజెపి ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. కరోనా కష్టాల నుండి ప్రజలు ఇంకా కోలుకోలేదని పట్టణాలకు కూడా ఉపాధిని విస్తరించి పేదలందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తుంటే ఉన్న ఉపాధికి ఎసురుపెట్టే విధంగా మోడీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఏడాది పాటు వీరోచితంగా ఢిల్లీ నడిబొడ్డున పోరాడిన రైతన్నల ఉద్యమానికి క్షమాపణలు చెప్పి చేసిన వాగ్దానాలను మోడీ ప్రభుత్వం అమలు చేయలేదని, కనీస మద్దతు ధరలు చట్టం తక్షణం అమల్లోకి తేవాలని వారు డిమాండ్ చేశారు. దేశంలోని కార్మిక వర్గం అనేక పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం కుదించి 4 చట్టాలుగా మార్చిందని ఈ దుష్ట విధానాలను ప్రతిఘటించేందుకు కార్మిక కర్షక కష్టజీవులంతా చలో ఢిల్లీకి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## త్రిపురాంతకం దేవాలయ రాజగోపురం నిర్మాణానికి

# రూ.80 లక్షలు మంజూరు

## మంత్రి సురేష్ ప్రత్యేక చొరవతోనే..

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

త్రిపురాంతకం దేవాలయం దక్షిణ రాజగోపుర నిర్మాణం కోసం ప్రభుత్వం 80 లక్షల రూపాయలను మంజూరు చేసింది. కామన్ గుడ్ ఫండ్ నిధి నుంచి ఈ నిధులను మంజూరు చేస్తూ ఆర్‌సి నెంబర్ పీ1/సిఓఈ/23-28తో శనివారం దేవదాయశాఖ కమిషనర్ ఎం హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసిద్ధిగాంచిన త్రిపురాంతకం దేవాలయ అభివద్ధి కోసం ప్రత్యేక దష్టి సారించిన రాష్ట్ర పురపాలక పట్టణ అభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ త్రిపురాంతకం ఆలయ అభివద్ధి కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల శివరాత్రి పర్వదినం నాటికి తన సొంత నిధులు దాదాపు రూ. 31 లక్షలు ఖర్చు చేసి ఆలయ ముఖ ద్వారం నిర్మించారు. ప్రస్తుతం రాజగోపుర నిర్మాణం కోసం ప్రత్యేక దష్టి సారించి దేవాదాయశాఖ అధికారుల దష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లిన మంత్రి సురేష్ నిధుల మంజూరు కోసం ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఈ మేరకు శనివారం రూ. 80 లక్షలు మంజూరు చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో రూ. 72 లక్షలు సర్వ శ్రేయో నిధి నిధులు కాగా రూ. 8 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్ ఉంటుంది. దేవాలయ అభివద్ధికి కషి చేస్తున్న మంత్రి సురేష్‌ను ప్రజలు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

# ఓటర్ల తీర్పు

ఎమ్మెల్సీ ఎన్నికల పర్వం ముగిసింది. ఉపాధ్యాయులు.. పట్టభద్రులు ఎమ్మెల్సీలను ఎన్నుకున్నారు. పాలకపక్షం పనితీరు ఎలా ఉందో విధితమవుతోంది.ప్రతిపక్షాల భవితవ్యం ఎలా ఉండబోతుందోనన్న చర్చకూడా ఉత్కంఠగానే సాగుతోంది. పాలకప్రతిపక్ష పార్టీల భవితవ్యాలకు ఈ ఎన్నికలు దిశానిర్దేశం చేశాయనే చర్చ ముందుకు వచ్చింది.రాజకీయంగా చూస్తే ప్రభుత్వానికి పట్టుభద్రులు వ్యతిరేకంగా ఉన్నారనే స్పష్టత వచ్చింది. తెలుగుదేశం అభ్యర్థి అనూహ్యంగా గెలిచారు. ప్రతిపక్షంలో నూతనోత్సాహం వచ్చింది. వచ్చే ఎన్నికలకు సంకేతాలుగా చెప్పుకుంటున్నారు. ఆపార్టీ నేతలు సంబరాల్లో ఉన్నారు. వైసిపికి ఎదురుదెబ్బతప్పలేదు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీని పాలకపక్షం ఆదినుంచీ అక్రమాలతోనే గెలుచుకోవాలనే ఆలోచనతో వచ్చింది. అనేక తప్పిదాలు చేశారు. ఎన్నడూ లేని విధంగా ప్రవేటు టీచర్లను ఓటర్లుగా చేర్చారు. గెలవడానికి అవకాశం ఉన్న మేరకు వీరిని చేర్చారు. అంతా వ్యూహాత్మకంగానే నడిచింది. పోలింగుకు ముందు డబ్బులు పంచారు. అన్ని రకాలుగా ప్రలోభపెట్టారు. ప్రవేటు టీచర్లతో గెలిచేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులు అందరూ పిడిఎఫ్‌కు ఓటేశారు.మరో ఉపాధ్యాయసంఘం పోటీలో ఉండటంతోపాటు తెలుగుదేశం పార్టీ కూడా అదే సంఘానికి మద్దతుగా నిలిచింది. పిడిఎఫ్‌తో రెండో ఓటు అవగాహన ఆఖరుఘట్టంలో జరిగింది. తెలుగుదేశం మద్దతు ఇచ్చిన సంఘం అభ్యర్థికీ, పిడిఎఫ్ అభ్యర్థికీ వచ్చినోట్లు వైసిపి అభ్యర్థికన్నా అధికంగానే ఉన్నాయి.ఫలితంగా అవగాహన అక్కరకు రాలేదు. వేర్వేరుగా పోటీలు చేయడంతో ఓట్లు చీలిపోయాయి. అయితే ఈ తీర్పు ఉపాధ్యాయులు ప్రభుత్వం వైపు ఉన్నట్లు అనుకుంటే భ్రమే అవుతుంది. ప్రవేటు టీచర్లతో అక్రమాలు చేసి తెచ్చుకున్న గెలుపు బలుపుగా భావిస్తే నష్టం తప్పదు.ఇప్పటికే ఉపాధ్యాయులు దశలవారీగా ఆందోళనలోన ఉన్నారు.మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.ఉపాధ్యాయుల ఓట్లు తక్కువగా ఉన్నందు అందులో ప్రవేటు వారిని కొనేశారు.అదే గ్రాడ్యుయేట్ విషయానికి వచ్చే సరికి కొంత మేరకు కొనుగోలు చేసినా ఫలితం దక్కలేదు. స్పష్టంగా పట్టభద్రులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారు. గెలిచిన కంచర్లశ్రీకాంత్‌కు వచ్చిన మెజార్టీనే దీన్ని విధితం చేస్తోంది. ఏదేమైనా ఈతీర్పు ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతోంది. తెలుగుదేశంలో భవిష్యత్‌పై ఆశలు పెంచింది.

అసెంబ్లీ సమావేశాలు వాడివేడిగా సాగుతున్నాయి. సమావేశాల్లోనే బడ్జెట్ ప్రవేశపెట్టి ఆమోదించారు.బడ్జెట్‌లో జిల్లాకు ఏం ఇచ్చారనేది పరిశీలిస్తే సంక్షేమపధకాలకు సాధారణంగా ఇచ్చే కేటాయింపులే తప్ప ఏమీలేవు.కీలకమైన వెలుగొండకు నిధుల్లేవు. కేవలం రూ.101 కోట్లు చూపారు.ప్యాకేజీలకు రూ.1200 కోట్లకుపైగానే నిధులు కావాలి. మంత్రి ఆదిమూలం సురేష్ దీనిపై దృష్టి సారించలేదా? ఈ కేటాయింపులు ఆయనకు తెలియవా? తెలిసే మౌనంగా ఉన్నారా? అనేదీ చూడాలి. సెప్టెంబరులో దీన్ని ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటికీ నిర్వాసితులు 7వేల మందికిపైగా ముంపుగ్రామాల్లోనే ఉన్నారు. వారికి పునరావాసం కల్పించాలి. కాలనీలు పూర్తికాలేదు. ప్యాకేజీలు ఇస్తే అక్కడ నుంచి కదులుతామని చెబుతున్నారు.అయితే నిర్వాసితులను కోతలు పెడుతూ జాబితాలు తయారు చేస్తున్నారు. వీటితోనే నిర్వాసితులు ఆందోళనలు చేస్తున్నారు. బయటకు వచ్చేందుకు కొందరు ఒట్టిచేతులతోనే రావాల్సి వస్తోంది. జాబితాల్లో పేర్లు లేక కలవరపడుతున్నారు. నిర్వాసితుల పట్ల సమగ్రమైన దృక్పధం లేదు.సర్వం కోల్పోతున్నవారికి మళ్లీ జీవనం కల్పించే చర్యలు లేవు. బడ్జెట్‌లో నిధులు లేకపోవడంతో దీనిపై అన్ని రకాలుగా గంగరగోళం కొనసాగుతోంది.

అకాల వర్షాలు రైతులను ముంచాయి. ప్రస్తుతం పొలాల్లో మిర్చి,దాన్యం ఉన్నాయి. హఠాత్తుగా కురిసిన వర్షాలకు ఇవన్నీ తడిచిపోతున్నాయి. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక చోట్ల వడగండ్ల వాన పడింది. పొలాల్లో ఆరబోసిన మిర్చి తడిచింది. పట్టలు కప్పుకుంటున్నారు. పొగాకు పంటకూ నష్టం తప్పదు. బర్లీపొగాకు కూడా తడిచిపోయింది. ఇంకా పొలాల్లో ఉన్న ఇతర పంటలు కూడా దెబ్బ తినే పరిస్థితి వచ్చింది. రైతులు పంటను దాచుకునేందుకు గ్రామాల్లో ఎటువంటి ప్రత్యామ్నాయాలు లేవు. తడిచిన పంటలకు ధరలు తగ్గకుండా కొనేలా చూడాల్సి ఉంది.

# ఇసుకను అందుబాటులో ఉంచండి

- ఇసుక డిపోలను మ్యాపింగ్ చేయాలి
- జెపి వెంచర్స్‌కు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

జిల్లాలో నిర్మాణాలకు అవసరమైన స్థాయిలో ఇసుకను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ జెపి వెంచర్స్‌ను ఆదేశించారు. ఆయన అధ్యక్షతన కలెక్టరేట్ లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం శనివారం జరిగింది. జిల్లాలో ప్రస్తుత ఇసుక నిల్వలు, రాబోయే సీజన్లకు ఎలాంటి కొరత లేకుండా తీసుకోవలసిన చర్యలపై ఈ సందర్భంగా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సీజన్‌కు 2 లక్షల మెట్రిక్ టన్నులు, వర్షాకాలంలో 3 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచాలని సరఫరాదారులను ఆదేశించారు. ఇసుక తవ్వకం పాయింట్లతో ఇసుక డిపోలను మ్యాపింగ్ చేయాలన్నారు. ఇసుకను రవాణా చేస్తున్న వాహనాలకు ప్రత్యేక గుర్తింపు నెంబర్లు కేటాయించాలని ఆదేశించారు. ఇసుక నాణ్యతను తవ్వకం పాయింట్ల వద్దే ప్రత్యేకంగా పరీక్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ వినియోగానికి ఎంత ఇసుక అవసరమవుతుందో శాఖల వారీగా అంచనాలు తెప్పించుకుని తనకు నివేదించాలనీ కలెక్టర్ స్పష్టం చేశారు. పట్టా భూములలో ఇసుక తవ్వకాలను నివారించడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసు, మైనింగ్, సెబ్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ విషయంలో సమన్వయంతో పనిచేయాలన్నారు. కేవలం రవాణా చేస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకోవడం మాత్రమే కాకుండా పట్టా భూయజమానిపైనా కేసు నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా నివారించడానికి డివిజన్ స్థాయిలో ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సిబ్బంది, అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే విధుల నుంచి సస్పెండ్ చేస్తామని ఆయన ప్రకటించారు. జరుగుమల్లిలో ఒకటి, ముండ్లమూరులో 3 ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసే ప్రతిపాదనలకు ఈ సందర్భంగా కలెక్టర్ ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, ఏఎస్‌పి నాగేశ్వరరావు, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జగన్నాధరావు, ఇరిగేషన్ ఎస్.ఈ. లక్ష్మారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మర్దన్ అలీ, కాలుష్య నియంత్రణ బోర్డు, పర్యావరణ ఇంజినీర్ నాగిరెడ్డి, సెబ్ ఎస్‌పి ఆవులయ్య, మార్కాపురం, ఒంగోలు గనుల శాఖ సహాయ సంచాలకులు, జె.పి. వెంచర్స్ ప్రతినిధులు, రవాణా, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.